ముమ్మరంగా ధరణి ఫైళ్ల క్లియరెన్స్

ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, జూన్ 18 : ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైళ్ల క్లియరెన్స్ ముమ్మరంగా కొనసాగుతుందని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఫైళ్ల పురోగతిపై తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, మాడ్గుల మండలాల్లో మొత్తం 1267 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పదిహేను రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరిష్కారం దిశలో ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా మండలాల తహసీల్దార్ల పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలు ఇప్పటికే పరిష్కరించామన్నారు. ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో జరుగాల్సిన ఫైళ్ల పరిష్కారం కూడా జరుగుతుందన్నారు. ధరణికి సంబంధించిన ఈ సమస్యలన్నింటినీ గడువులోగా పూర్తిచేయటానికి తహసీల్దార్లకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. ఆయా మండలాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రతిరోజు కొన్ని ఫైళ్లను టార్గెట్‌గా పెట్టుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

పెద్దఅంబర్‌పేట, జూన్ 18: మున్సిపాలిటీ పరిధి కళానగర్, పసుమాములలో అర్బన్ మూమెంట్ ఇన్నోవేషన్ ఫండ్ సహకారంతో అవేక్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్డ్స్) ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, బయోగ్యాస్ సోలార్ లైట్స్, సుకన్య సమృద్ధి ఖాతాలపై మంగళవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎలాంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలో వివరించారు. కార్యక్రమంలో ఈడీఎంసీ ఆర్ మల్లేశ్, పొదుపు సంఘాల ఆర్పీలు హైమావతి, నిర్మల, ఎం సుగుణ, ఆర్డ్స్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్, ఆర్ నర్సింహ పాల్గొన్నారు.

21న సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు, జూన్ 18: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షురాలు నేనావత్ అనిత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఏపీఎంపై కఠిన చర్యలు తీసుకోండి

ఏపీఎం రామస్వామిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మండల నాయకులు

షాద్‌నగర్, జూన్18: మహిళా సిబ్బందిని వేధిస్తున్న చౌదరిగూడ మండల మహిళా సమాఖ్య ఏపీఎం రామస్వామిపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు, స్థానిక మండల నాయకులు తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదుచేశారు. ఏపీఎం రామస్వామి కొన్ని రోజులుగా మహిళలను వేధిస్తున్నారని, మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రామస్వామి గతంలో మాడ్గుల మండలంలో పనిచేసే సమయంలో కూడా ఈ తరహా ఫిర్యాదు వచ్చిందని, మహిళా సిబ్బందిని వేధిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఏపీఎంపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోకుంటే మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నాయకులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్, శ్రీశైలం, అనీల్, మల్లేశ్, విఠల్, హరీశ్, లక్ష్మణ్, శ్రావణ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన రవాణా వ్యవస్థకు కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఉత్తరాసిపల్లిలో మట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జూన్18: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొందుర్గు మండలం ఉత్తరాసిపల్లి గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో రూ. 8 లక్షల వెచ్చించి మట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా రవాణా వ్యవస్థ బలోపేతం కావాలని అన్నారు. రానున్న రోజుల్లో విడుతల వారీగా అన్ని గ్రామాలకు నూతన బీటీ రోడ్లతో పాటు మరమ్మతు పనులను చేపడుతామని చెప్పారు. గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్ల బాగుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశ్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, అంజిరెడ్డి, ఫయూమ్, రామచంద్రయ్య, కృష్ణయ్య, నాయకులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి

చేవెళ్లటౌన్, జూన్ 18: సమయానికి ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భాజపా చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి ఆరోపించారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇస్తున్నామని చెప్పి బస్సుల సంఖ్యను పూర్తిగా తగ్గించడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు లేక చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు సమయానికి పాఠశాలలకు చేరుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే బస్ సర్వీసుల సంఖ్య తగ్గిందని, నగరం నుంచి చేవెళ్ల మీదుగా వికారాబాద్, తాండూరు వెళ్లే ప్రయాణికులకు బస్సులు సరిగ్గా లేక సతమతమవుతున్నారని తెలిపారు. ఉదయం, సాయంత్రం అదనపు బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశారు. లేదంటే భాజపా ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేపడుతామన్నారు. సమావేశంలో బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, జైషింహ, గణేశ్ పాల్గొన్నారు.

యాచారం మండలంలో అరకొరగా..

యాచారం : మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు కరోనా కారణంగా రద్దు చేసిన ఆర్టీసీ బస్సులను తిరిగి పునరుద్ధరించాలని మేడిపల్లి గ్రామానికి చెందిన పొద్దుటూరి రవీందర్ కోరారు. మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆయన ఫోన్ ద్వారా ఆర్టీసీ సమస్యలను ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సులు లేక విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. యాచారం నుంచి కందుకూరు వెళ్లడానికి రవాణా సౌకర్యం ఇబ్బందికరంగా మారిందని వెంటనే బస్సులు నడపాలని సూచించారు. మాల్ అజిలాపూరం నైట్ హాల్ట్ బస్సును తిరిగి కొనసాగించాలని కోరారు. తాటిపర్తి వయా నందివనపర్తి నైట్ హాల్ట్, మేడిపల్లి నైట్‌హాల్ట్, మేడిపల్లి, ఆమనగల్లు, మాల్, మొండిగౌరెల్లి బస్సులను పునరుద్ధరించాలని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుల అవసరాల మేరకు అదనపు బస్సులు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

లోతట్టు ప్రాంతాలను గుర్తించేందుకు పైలట్ సర్వే

ట్రయల్ రన్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న

ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్‌టౌన్, జూన్ 18: షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలను గుర్తించేందుకు హైదరాబాద్ బ్రాన్ సర్వీసెస్ పైలట్ సర్వేను నిర్వహించేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీలో ట్రయల్ రన్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసినప్పుడు వర్షపునీరు, మురుగునీరుతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టేందుకు వర్షపునీరు నిలువలు, మురుగునీటి కాలువలను డ్రోన్ ద్వారా గుర్తిస్తున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించేందుకు సర్వే నిర్వహించడానికి ముందుకొచ్చిన హైదరాబాద్ బ్రాన్ సర్వీసెస్ ఛీఫ్ ఇంటిగ్రేటర్ కెన్నాట్, వైస్ ప్రెసిడెంట్ సాయిప్రసాద్‌కరం శెట్టి, ప్రొడక్ట్ మేనేజర్ చైతన్య, ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ చైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రాయుడు, నాయకుడు సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా యూజీసీ ఎన్ఈటీ పరీక్ష

హాల్ టిక్కెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

కడ్తాల్, జూన్ 18: మండల కేంద్రంలోని ఫార్చ్యూన్ బట్టర్‌ఫ్లై సీనియర్ సెకండరీ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన యూజీసీ ఎన్ఈటీ-2024 పరీక్ష సజావుగా ముగిసింది. ఉదయం నిర్వహించిన సెషన్-1 పరీక్షకు 276 మంది విద్యార్థులకు 182 మంది, సెషన్-2 పరీక్షకు 600 మంది విద్యార్థులకుగానూ 478 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం పరిశీలకులు అనిల్, సుజాత, ఉప పరిశీలకుడు సత్యనారాయణ, సెంటర్ సూపరింటెండెంట్ రంగారావు, డిప్యూటీ సెంటర్ సూపరింటెండెంట్ భుజంగరావు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా ఇంటింటికీ సర్వే

తంగడిపల్లిలో సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి సురేందర్ రావు

చేవెళ్ల రూరల్, జూన్ 18 : మండల పరిధిలోని గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటికీ సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నది. మంగళవారం తంగడిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సురేందర్ రావు పర్యవేక్షణలో వివరాల సేకరణ చేపట్టారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీటి నల్లా కనెక్షన్లు ఉన్నాయా.. లేదా.. నీరు సక్రమంగా సరఫరా అవుతుందా.. అనే అంశాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తంగడిపల్లి, అనుబంధ గ్రామం మడికట్టులో ఇప్పటికే 70 శాతం సర్వే పూర్తయిందని, గ్రామస్తులు ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించి పూర్తి వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యదర్శి వెంట ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, కారోబార్ జంగయ్య, అంగన్‌వాడీ టీచర్ అనిత, తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కడ్తాల్, జూన్ 18: వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన వసతి గృహం, కేజీబీవీ విద్యాలయం, మైసిగండి గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని గదులు, ఆశ్రమ పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థులకు అందించే భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో మద్యానికి మంత్రి ఉన్నాడేగాని, విద్యాశాఖకు మాత్రం మంత్రిలేడని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గాలికొదిలేసిందని ఆరోపించారు. వసతి గృహాల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుతారని, వారిని వార్డెన్లు కంటికిరెప్పలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసి, ఎట్టీ హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, హరిచంద్‌నాయక్, లోకేశ్‌నాయక్, సులోచన, శ్వేత, భాగ్యమ్మ, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, వెంకటయ్య, వార్డెన్లు బాలరాజు, రాములు, నాయకులు సాయిలు, భూనాథ్‌నాయక్, జంగయ్యగౌడ్, పాండునాయక్, శ్రీనూనాయక్, కిషన్, పాండు, శ్రీకాంత్, జైపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

పెద్దఅంబర్‌పేట : విద్యార్థులతో వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కౌన్సిలర్ హరిశంకర్, ఉపాధ్యాయులు

పెద్దఅంబర్‌పేట, జూన్ 18: ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి కుంట్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌన్సిలర్ హరిశంకర్ ముదిరాజ్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, నాయకుడు విజయ్‌శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరం

షాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ ప్రాథమిక పాఠశాలల్లో అదే గ్రామానికి చెందిన వడ్ల చంద్రశేఖర్‌తో కలిసి విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామియా, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, బాలయ్య, రవి, ప్రశాంత్, నర్సింహ, కృష్ణ, యాదయ్య, శ్రీనివాస్, రామగౌడ్, నర్సింహారెడ్డి, దయానంద్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకురాలిగా ఆదిలక్ష్మి

ఆమనగల్లు, జూన్ 18 : రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రంలో వ్యవసాయ సహాయ సంచాలకులుగా విధులు నిర్వహించిన ఆదిలక్ష్మి మంగళవారం ఆమనగల్లు డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులుగా ఆదిలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. గతంలో మహేశ్వరం వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత ఆమనగల్లు వ్యవసాయ సహాయ సంచాలకులుగా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

ఆర్థిక సాయం అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 18 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో సభ్యులవరైనా మరణిస్తే వారి కుటుంబానికి సంఘం తరపున ఆర్థిక సాయం అందిస్తున్నామని చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్ తెలిపారు. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన అల్వాల పెంటయ్య 2019లో మృతి చెందాడు. ఆయన భార్య రేణుకకు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో మంగళవారం రూ. 15వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట డైరక్టర్ రాములు, అకౌంటెంట్ రాకేశ్‌గౌడ్ ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

యాచారం, జూన్18: మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం పలు గ్రామాల్లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు మహ్మద్ గౌస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మంథన్‌గౌరెల్లి, కేసీతండా, నల్లవెల్లి, చింతపట్ల గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం, జూన్ 18 : విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొటగింపులో భాగంగా మండలంలోని మొండిగౌరెల్లి గ్రామంలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఇండ్లలోకి వర్షపు నీరు

ఇండ్లలోనికి చేరిన వరద నీరు

మొయినాబాద్, జూన్18:మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. దీంతో పెద్ద ఎత్తున వరద నీరు ఇండ్లలోనికి వెళ్లింది. వర్షం పడినప్పుడు ఇండ్లలోకి రాకుండా వరద నీరు వెళ్లడానికి మార్గం చూపాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజలను పట్టించుకునే నాథుడే కరువైయ్యాడని గ్రామస్తులు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

కందుకూరు, జూన్ 18 : రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని.. బుధవారం మండల విద్యాధికారుల కేంద్రం వద్ద మండల సీపీఎం పార్టీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ధర్నా నిర్వహించిన అనంతరం మండల విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన అనంతరం పూర్తిగా విస్మరించినట్లు పేర్కొన్నారు. కూరగాయల రేట్లు విపరీతంగా పెరిగాయని దీంతో పెరిగిన రేట్లతో కార్మికులకు విద్యార్థులకు భోజన వండి పెట్టడం భారంగా మారిందని చెప్పారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన రేట్లకు అనుగుణంగా బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి ప్రభావతి, అండాలు, అశ్విని, లక్ష్మమ్మ, భారతమ్మ, భాగ్యమ్మ, కళమ్మ పాల్గొన్నారు.

ప్రగతి చక్రం అవార్డుల ప్రదానం

పెద్దఅంబర్‌పేట, జూన్ 18: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సుచరిత అన్నారు. బండ్లగూడ డిపో పరిధిలో మే నెలకు సంబంధించిన ప్రతిభచాటిన సిబ్బందికి ప్రగతి చక్రం అవార్డులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం తర్వాత బస్సులో అత్యధిక ఆక్యుపెన్సీ రేషియో సాధించిన సంస్థను లాభాల బాటలోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డిపోలో ఉద్యోగులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో బండ్లగూడ డిపో మేనేజర్ రమేశ్, సీఐ శాలిని, బాలయోగీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కదిలిన యంత్రాంగం.. సమస్యకు మార్గం..

మొయినాబాద్, జూన్18 : నమస్తే తెలంగాణ దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన 'పాట్లు పడుతున్నా... పట్టించుకోరా' అనే శీర్షికకు ప్రభుత్వం స్పందించింది. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి కింది నుంచి వర్షం వరద నీళ్లు వెళ్లడానికి గతంలో కల్వర్టు నిర్మాణం ఉంటే జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మాణాలు చేపట్టారు. దీంతో నీళ్లు వెళ్లాల్సిన కల్వర్టు పూర్తిగా మూసుకుపోవడంతో రోడ్డు మీది నుంచి దిగువ ప్రాంతం నుంచి కిందికి నీళ్లు వెళ్లిపోయేవి. కానీ రోడ్డు పక్కనే దిగువ ప్రాంతంలో ఓ భూమి యజమాని ప్రహరీ నిర్మాణం చేపట్టడంతో జాతీయ రహదారి మీదనే నిలుస్తుండడంతో సమస్య తీవ్రమైంది. వరద నీళ్లు రోడ్డు మీద ఆగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే పాట్లు పడుతున్నా.. పట్టించుకోరా అనే కథనం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. సంబంధిత పోలీస్ అధికారులు రోడ్డు మీద వరద నీళ్లు నిలిచే ప్రాంతాన్ని సందర్శించారు. కల్వర్టును ఎవరు మూసి వేశారు. వరద నీళ్లు వెళ్లకుండా ఎవరు అడ్డుగా నిర్మిణాలు చేపట్టారనే కోణంలో పోలీస్ అధికారులు వివరాలను సేకరించారు. బుధవారం కూడా వారు మరోసారి రోడ్డు మీద వదర నిలిచే ప్రాంతానికి వెళ్లి పూర్తి స్థాయిలో వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పూర్తిస్థాయిలో నివేదికను అందించనున్నారు.

ఫార్మా భూములు పరిశీలన



ఫార్మాసిటీ భూములు పరిశీలిస్తున్న ధరణి చైర్మన్ కోదండరెడ్డి, తాసీల్దార్, తదితరులు

కందుకూరు, జూన్ 18: ఫార్మాసిటీ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించిన భూములను ధరణి చైర్మన్ కోదండరెడ్డి పరిశీలించారు. మంగళవారం ఉదయం భూముల వద్దకు వచ్చి తాసీల్దార్ గోపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మెడికల్ కళాశాలకు కేటాయించిన భూములను పరిశీలించారు. కాగా ఉన్నఫలంగా భూముల పరిశీలనలో ఆంతర్యమేమిటని.. అసలు ఫార్మాసిటీతో పాటు మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తారా, లేక ఇతర కంపెనీలు ఏర్పాటు చేస్తారా అనే విషయంపై స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు చర్యలు

మన్సూరాబాద్, జూన్ 18: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీ ఆధ్వర్యంలో వాక్ ఫర్ వాటర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కరుణాకర్ రెడ్డి సహకారంతో వర్షపు నీటిని ఒడిసి పట్టే సరికొత్త ప్రాజెక్టును మంగళవారం ప్రారంభించారు. సహారా కాలనీలో చెత్తాచెదారంతో నిండిపోయి మట్టి పేరుకుపోయిన 12 ఇంకుడు గుంతలు, 2 ఓపెన్ వెల్స్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ మాట్లాడుతూ.. సహారాస్టేట్స్ కాలనీలో పడిన ప్రతి వర్షపు నీటిని ఇంకుడు గుంతలు, ఓపెన్ వెల్స్‌లోకి మళ్లించి భూగర్భ జలాలను వృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితులతో నీటి కోసం నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఇలాంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కాలనీవాసుల భాగస్వామ్యంతో వర్షపునీటిని సంరక్షించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వాక్ ఫర్ వాటర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వాన నీటి సంరక్షణ కోసం కాలనీవాసులు కలిసికట్టుగా ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి, భూతాపాన్ని తగ్గించేందుకు తోడ్పాటునందిస్తాయన్నారు. సుమారు 42 ఎకరాల్లో విస్తరించి ఉన్న సహారాస్టేట్స్‌కాలనీలో 900 పైగా కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. కాలనీవాసుల సహకారంతో సంవత్సరానికి 1500 మిలియన్ లీటర్లు (15 కోట్